ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 17.0
ANDHRAJYOTHY
5
నారాయణపేట
జిల్లా వార్తలు
మంగళవారం 7 జనవరి 2025



శ్రీశైలం జలాశయంలో 860 అడుగులకు చేరిన నీటిమట్టం

వారం రోజులుగా పంపుమోడ్ నిలిపివేత

ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో వాటర్ లీకేజీ కావడంతో డ్యాంలోకి నీటి మళ్లింపు

7

అచ్చంపేటకు అచ్ఛేదిన్

నల్లమల సమగ్రాభివృద్ధే లక్ష్యం

- దివంగత పుట్టపాగ మహేంద్రనాథ్ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తా
- ఉమామహేశ్వరం రిజర్వాయర్‌తో లక్ష ఎకరాలకు సాగునీరు
- ఈ నెలాఖరులో శంకుస్థాపన
- రెండు దశల్లో రూ.2,300 కోట్లతో పనులు
- నియోజకవర్గంలో ప్రతీ సెంటు, గుంటకు సాగునీరు
- రూ.7,700 కోట్లతో నల్లమల హైవే కారిడార్
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

నాగర్‌కర్నూల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన నల్లమల అటవీ ప్రాంతంలో అంతర్భాగంగా ఉన్న అచ్చంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. నీతి, నిజాయతీ, నిరాడంబరతకు మారు పేరైన పుట్టపాగ మహేంద్రనాథ్ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గానికి శాసన సభ్యుడిగా రెండు దఫాలు ఎన్నిక కావడం తన అదృష్టమన్నారు. దళితులు, వెనుకబడిన వర్గాల కోసం అమ్రాబాద్‌లో పుట్టపాగ మహేంద్రనాథ్ నెలకొల్పిన హాస్టల్లో చదువుకుని డాక్టర్‌గా, రాజకీయ నాయకునిగా ఎదగడం తన పూర్వజన్మ సుకృతమని చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నాలుగేళ్లల్లో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి, తన నిబద్ధతతను నిరూపించుకుంటానని చెప్పారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు..

వెనకబడిన అచ్చంపేట నియోజకవర్గం నుంచి రెండవ సారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ప్రాంత అభివృద్ధి పట్ల మీకు ప్రత్యేకమైన విజన్ ఉందా?

కచ్చితంగా ఉంది. దళిత సామాజిక వర్గానికి చెందిన తనను రెండవసారి ఎన్నుకున్నందుకు ఈ ప్రాంత ప్రజలకు జన్మాంతం రుణపడి ఉంటా. దళితులు, అణగారిన వర్గాలు, చెంచులు అధిక సంఖ్యలో ఉన్న ఈ నియోజకవర్గానికి సేవ చేయకుంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతాను. ఇక్కడి నుంచి నేను గెలవడం, రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం నా అదృష్టం. నల్లమల బిడ్డ ముఖ్యమంత్రి కావడం నాకు కలిసొచ్చే అంశాలు. నేను కూడా చొరవ చూపి ఈ నియోజకవర్గంలో అన్ని వర్గాల సహకారం తీసుకుంటే అచ్చంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం కష్టతరమైన అంశమేమీ కాదు. పార్టీలకు అతీతంగా సహకరిస్తే రాబోయే నాలుగేళ్లల్లో నియోజకవర్గ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి.

నల్లమల తురుపు జాతి పశువులు తెలంగాణ గిత్తగా ఎందుకు గుర్తించబడటం లేదు?

ఇందుకు సంబంధించిన కార్యాచరణ కొనసాగుతోంది. అనేక ప్రాధాన్యతలు కలిగిన తురుపు జాతి గిత్తలు, ఆవులపై భారత ప్రభుత్వం చేసిన పరిశోధనలు, డీఎన్‌ఏ రిపోర్టులు ఈ పశువుల ప్రత్యేకతలపై సవివరంగా ఉన్న నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందించడం జరిగింది. త్వరలోనే ఈ పశువులను తెలంగాణ గిత్తగా ప్రకటించడంతోపాటు మన్ననూర్‌లో వెటర్నరీ, పాలిటెక్నిక్‌లు పెట్టాలనే యోచనలో ప్రభుత్వం ఉంది.

నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి మీ దగ్గర ఉన్న ప్రణాళిక ఏంటి?

దివంగత పుట్టపాగ మహేంద్రనాథ్ కాలంలో అచ్చంపేట నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి జరిగింది. ఆయన స్ఫూర్తితోనే ఈ అంశానికి ఇతోధిక ప్రాధాన్యం ఇస్తున్నాను. మొదటిసారి నేను ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు కూడా అమ్రాబాద్‌లో డిగ్రీ కాలేజ్ నెలకొల్పా. మున్ముందు లింగాల, పదర, చారకొండ మండలాల్లో ప్రభుత్వపరంగా జూనియర్ కళాశాలలు నెలకొల్పాలనే యోచన ఉంది. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలను దాదాపు 20 కోట్ల రూపాయల ఖర్చుతో కొత్తగా నిర్మించనున్నాం. అచ్చంపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అమ్రాబాద్, అచ్చంపేటలో పీజీ కాలేజ్ ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించాం. మన్ననూర్‌లో 12 కోట్ల రూపాయల వ్యయంతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ త్వరలో ప్రారంభం

(మిగతా 6లో..)

నేటి నుంచి రాష్ట్ర స్థాయి

వైజ్ఞానిక ప్రదర్శన

- ఏడు అంశాల్లో 861 ప్రదర్శనలు
- పోలేపల్లి టీఎస్ ఐఐసీలోని ఎస్వీకేఎం పాఠశాలలో ఏర్పాట్లు
- పాల్గొననున్న 33 జిల్లాలకు చెందిన 2,500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు
- ప్రారంభించనున్న మంత్రులు



హెల్ప్‌డెస్క్‌లో వివరాలు తెలుసుకుంటున్న ప్రదర్శనకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/జడ్చర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక అంశాల పట్ల ఆసక్తి పెంపొందించి, నూతన ఆవిష్కరణలను గుర్తించేందుకు ఎస్‌సీఈఆర్‌టీ, ఎస్ఈఆర్‌టీ, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలకు ఈ ఏడాది పాలమూరు జిల్లా వేదిక కానుంది. జిల్లాలో 14 సంవత్సరాల తర్వాత ఈ ప్రదర్శన నిర్వహించనున్నారు. జడ్చర్ల సమీపంలోని పోలేపల్లి సెజ్‌లో ఉన్న ఎస్‌వీకేఎం పాఠశాలలో ఇందుకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం నుంచి ఈ నెల తొమ్మిదో తేదీ వరకు మూడు రోజుల పాటు ప్రదర్శన కొనసాగనుంది. తొమ్మిదో తేదీ ఉదయం ఉత్తమ ప్రదర్శనల ఫలితాలు వెలువడనున్నాయి. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది.

861 ప్రదర్శనలు

ప్రదర్శనలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 2,500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు

(మిగతా 6లో..)

ప్రదర్శనలకు సర్వం సిద్ధం

మహబూబ్‌నగర్ డీఈవో ప్రవీణ్‌కుమార్

6

సైబర్ నేరగాళ్ల ముఠా పట్టివేత

తెలుగు రాష్ట్రాల్లో రూ. 2 కోట్లు కాజేత

వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

7



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ గిరిధర్



ఎంబ్రాయిడరీలో శిక్షణ పొందుతున్న మహిళలు

ఉపాధికి ఊతం

యువతకు అండగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ

తొమ్మిది అంశాల్లో మూడు నెలల పాటు శిక్షణ

ఇప్పటి వరకు 3,200 మందికి ట్రైనింగ్

7

పేదలకు నిరంతర వైద్యం

- పెరిగిన ఓపీ, ఐపీ సేవలు
- సర్జరీలు, డెలివరీ కేసులను పెంచేందుకు కృషి
- జనరల్ ఆస్పత్రి వార్షిక నివేదికను విడుదల చేసిన సూపరింటెండెంట్



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ సంపత్ కుమార్

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని నిరుపేదలకు నిరంతర వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ అన్నారు. సోమవారం ఆస్పత్రిలోని సమావేశ మందిరంలో సేవలకు సంబంధించిన వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఓపీ, ఐపీ సేవలు గణనీయంగా పెరిగాయన్నారు. ఓపీ సేవలు గత ఏడాది 1,24,248 మంది వినియోగించుకోగా.. ఈ ఏడాది 4,10,810 మందికి పెరిగారని. ప్రతీ రోజు 1,700 మంది వరకు ఓపీకి వస్తున్నారన్నారు. అదేవిధంగా ఐపీలో కూడా రోజుకు 125 మంది వరకు అడ్మిట్ అవుతున్నారన్నారు. డెలివరీలు, సర్జరీల విషయంలో కొంత వెనకబాటు ఉందన్నారు. అన్ని విభాగాధిపతులతో ప్రతీ నెల సమీక్షలు నిర్వహించి వాటిని పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ కేసులు కూడా పెరిగాయని, వాటి ద్వారా ఆసుపత్రికి ఆదాయాన్ని కూడా సమకూరుస్తున్నామన్నారు. క్యాజువాలిటీ, లేబర్ రూం, ఐసీయూ, చిన్నపిల్లల ఐసీయూ, ఎస్ఎన్‌సీయూ విభాగాలలో 24 గంటలు వైద్యసేవలు అందేవిధంగా డాక్టర్లను ఏర్పాటు చేశామన్నారు. ఏ ఒక్క కేసు కూడా హైదరాబాద్‌కు రెఫర్ కాకుండా చూస్తున్నామని, అత్యవసరం అయ్యి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అవసరం ఉంటే తప్ప హైదరాబాద్‌కు పంపించడం లేదన్నారు. ఇతర జిల్లాల నుంచి కూడా హైరిస్కు కేసులు వస్తున్నాయని, వాటిని కూడా చాలెంజింగ్‌గా తీసుకొని రోగికి న్యాయం చేసి ప్రాణాలు కాపాడుతున్నామన్నారు. ఈ విషయంలో డాక్టర్ల పనితీరు చాలా బాగుందన్నారు. సానిటేషన్ విషయంలో కొంతవరకు మెరుగుపడిందన్నారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశారని, వాటి ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. ల్యాబు రిపోర్టులు ఆలస్యం కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోగులకు అందించే వైద్యసేవల విషయంలో డాక్టర్లు, నర్సులు నిర్లక్ష్యం చేసినా ఉపేక్షించడం లేదని, అలాంటి వారిని సస్పెండ్ కూడా చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునిల్, ఆయా విభాగాధిపతులు డాక్టర్లు సురేష్, శ్రీకాంత్, అమరావతి, హనుమప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

లారీ, కారు ఢీకొని ఒకరి మృతి

లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఢీకొన్న కారు

తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందిన భార్య

భర్త కాలుకు తీవ్ర గాయాలు

జడ్చర్ల మండలం చిట్టెబోయిన్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై ప్రమాదం

జడ్చర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలం చిట్టబోయిన్‌పల్లి శివారులోని గురుకుల పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూల్ పట్టణానికి చెందిన భార్యాభర్తలు పురుషోత్తంరావు, విజయలక్ష్మీ(55) ఆదివారం సాయంత్రం జడ్చర్ల నుంచి కొత్తకోటకు కారులో వెళ్తున్నారు. చిట్టబోయిన్‌పల్లి సమీపంలో ముందుగా వెళ్తున్న లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ, సడన్‌గా బ్రేక్ వేశాడు. దాంతో వెనుక ఉన్న కారు లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజయలక్ష్మీ అక్కడికక్కడే మృతి చెందింది. పురుషోత్తంరావు కాలుకు తీవ్ర గాయం అయ్యింది. దాంతో చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పురుషోత్తంరావు కుమారుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

కోయిల్ సాగర్ పంప్‌హౌస్ పరిశీలన

మరమ్మతులకు నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరిన అధికారులు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్న వాకిటి శ్రీహరి



కోయిల్ సాగర్ పంప్‌హౌస్ వద్ద అధికారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నర్వ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా నర్వ మండలం నాగిరెడ్డిపల్లె శివారులో కోయిల్‌సాగర్ పంప్‌హౌస్‌ను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సోమవారం పరిశీలించారు. ఇరిగేషన్ ఈఈ, డీఈలు మాట్లాడుతూ పంప్‌హౌస్‌లోకి దిగి మరమ్మతులు చేసేందుకు మెట్లు లేవని, అక్కడక్కడ కాలువ పనులు పెండింగ్ ఉన్నాయని చెప్పారు. అందుకోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. రాంపూర్ గేట్ వద్ద రోడ్డు పక్కన కుమార్ లింగంపల్లె చెరువులకు నీటిని మళ్లించే కాలువకు అండర్ పాస్ పైప్‌లైన్ వేయాలని, కాలువ దాటడానికి అక్కడక్కడ వంతెనలు నిర్మించాలని రైతులు కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ మల్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు చెన్నయ్య సాగర్, జగదబి రాంరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, వివేక్ వర్ధన్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

మూర్ఛ వ్యాధితో కరిగెటలోపడి రైతు మృతి

కోడేరు మండలం బావాయిపల్లిలో ఘటన

కోడేరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మూర్ఛ వ్యాధితో కరిగెటలో పడి ఓ రైతు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో చోటు చేసుకున్నది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.... బావాయిపల్లి గ్రామానికి చెందిన తెలుగు జడ్పేలు కురుమయ్య (35) సోమవారం ఉదయం తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో కరిగెట చేసే పని చేపట్టాడు. పొలంలో వడ్డు వరాలు చేస్తూ మూర్ఛ వ్యాధితో అకస్మాత్తుగా కరిగేటలో పడి మృతి చెందాడు. మృతునికి భార్య భాగ్యలక్ష్మీ, ఓ కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు అయిన కురుమయ్య మృతితో కుటుంబం రోడ్డున పడిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

భూ తగాదాలతో తమ్ముడిపై అన్న కత్తితో దాడి

అచ్చంపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : భూ తగాదాలతో గొడవపడి తమ్ముడిపై అన్న కత్తితో దాడి చేసిన సంఘటన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలో చోటుచేసుకున్నది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం బొమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన కొత్ర అర్జునయ్య, అతని అన్న కొత్ర వేణుగోపాల్ తమ భూ పంపకాల విషయంలో తరచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున కొత్ర అర్జునయ్యపై అన్న కత్తితో దాడి చేసి ఐదు సార్లు పొడిచాడు. వారిని ఆపేందుకు వెళ్ళిన ప్రదీప్ అనే వ్యక్తి చేతి వేలికి గాయమై తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే అర్జునయ్యను అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య కొత్ర శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దాపూర్ ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.



కర్నిలో సందె రాయిని ఎత్తిన ఓ యువకుడు



మొదటి బహుమతి విజేతకు షీల్డును అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాహుబలి

- 80 కిలోల సందె రాయిని ఎత్తిన ఎల్లప్ప
- కర్నిలో ఘనంగా ఉర్సు ఉత్సవాలు

మక్తల్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కర్నిలో జరుగుతున్న హజ్రత్ మహబూబ్ సుభాని ఉర్సు ఉత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సందె రాళ్ల పోటీలు నిర్వహించారు. గ్రామ యువకులు సందె రాళ్లను ఎత్తేందుకు పోటీ పడ్డారు. చాపలి ఎల్లప్ప 80 కిలోల బరువు ఎత్తి, మొదటి విజేతగా నిలిచాడు. రాజమూరి రాజు, ఈడిగి నరసింహులు రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు జ్ఞాపికలను అందించి, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణయ్యగౌడ్, భీమేష్, గాసం నరసింహ, ఎద్దుల హనుమంతు, వాకిటి హనుమంతు, ఈద నాగరాజు, ఉప్పరి నవీన్, నంబర్ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటకు అచ్చేదిన్

(మొదటి పేజీ తరువాయి)



కానుంది. నియోజకవర్గంలో విద్యాపరంగా పది మందికి పనికొచ్చి, పది కాలాల పాటు నిలిచి ఉండే పనులు చేయాలనేది నా సంకల్పం.

వైద్య పరంగా నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సదుపాయాలు కల్పించనున్నారు?

నేను స్వతహాగా డాక్టర్‌ను. వెనుకబడిన ప్రాంతాల ప్రజల కష్టాలు నాకు తెలుసు. రెండవసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే అచ్చంపేటలో మెగా సర్జికల్ క్యాంపు నిర్వహించి గుండె, మెదడు ఆపరేషన్లు మినహాయించి 762 సర్జరీలు చేశా. మళ్లీ ఈ నెల 24, 25న సర్జికల్ క్యాంపు నిర్వహించి దాదాపు వెయ్యి మందికి శస్త్రచికిత్స చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నాం. అచ్చంపేట ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్, ఐసీయూ, ఇంటెన్సివ్ కేర్ యూనిట్, వెంటిలేటర్ సపోర్టు సదుపాయాలు కల్పిస్తాం. సీటీ స్కాన్ సేవలను కూడా ప్రతిపాదించాను. మన్ననూర్‌లో తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ నెల రోజుల్లో ప్రారంభం కానుంది. ట్రామా కేర్ యూనిట్ కూడా ప్రారంభించనున్నాం. అమ్రాబాద్‌లో ట్రైబల్ ఏరియా ఆసుపత్రి నిర్మించడం ద్వారా ఈ ప్రాంత ప్రజానీకానికి విస్తృతమైన, అధునాతనమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి.

దోమలపెంట, ఈగలపెంట పేర్లు మారుస్తున్న విషయం వాస్తవమేనా?

ఈ విషయం వాస్తవమే. ఆ రెండు గ్రామాల చారిత్రక ప్రాధాన్యత గురించి అధ్యయనం చేసిన తర్వాత పేర్లు మార్చాలని నిర్ణయించాం. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా ప్రభుత్వానికి వెళ్లాయి. త్వరలో అధికారిక ఉత్తర్వులు కూడా రానున్నాయి. ఇక ముందు దోమలపెంట బ్రహ్మగిరిగా, ఈగలపెంట కృష్ణగిరిగా పిలువబడుతాయి.

అచ్చంపేట లిఫ్టు ఇరిగేషన్ స్కీం ఎంత వరకు వచ్చింది?

ఇందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద ఇతమిద్ధమైన ప్రణాళిక ఉంది. అచ్చంపేట ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గంలో ప్రతీ సెంటు, గుంటకు నీరందించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. జనవరి చివరి వారం లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ఉమామహేశ్వరం రిజర్వాయర్ పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారు. దీని ద్వారా మొదటి దశలో రూ.1532 కోట్లు, రెండో దశలో దాదాపు రూ.700 కోట్ల ఖర్చు చేసి బల్మూరు, అచ్చంపేట, అమ్రాబాద్, పదర, లింగాల, తెలకపల్లి మండలాల్లో దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరందిస్తాం. నియోజకవర్గంలో చెరువులు, కుంటల అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రణాళికను రూపొందించి నిధులు తెచ్చే ప్రయత్నాలను చేస్తున్నాం.

నల్లమలలో టూరిజం అభివృద్ధికి ఎలాంటి ప్రతిపాదనలు చేశారు?

వెనుకబడిన అచ్చంపేట నియోజకవర్గంలో స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలంటే పర్యాటకాన్ని ప్రధాన ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇందు కోసం కార్యాచరణను రూపొందించాం. అటవీ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి 20 ప్రాంతాలను ప్రధానంగా గుర్తించాం. వీటిలో టూరిజం అభివృద్ధి ద్వారా వచ్చే ఆదాయంలో చెంచులకు కూడా 30 శాతం భాగస్వామ్యం కల్పించాలని నిర్ణయించాం. ఏడాదికోసారి మాత్రమే కొనసాగే సలేశ్వరం సందర్శనను తొమ్మిది నెలల పాటు కొనసాగించాలని నిర్ణయించాం. టూరిజం, ఫారెస్టు అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఈ కార్యాచరణను పూర్తి చేస్తారు. అక్కమహాదేవి గుహలు, మల్లెల తీర్థం, వ్యూపాయింట్‌లను కూడా సుందరంగా తీర్చిదిద్ది పర్యాటకులకు విస్తృతమైన సౌకర్యాలు కల్పించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నల్లమలలో 20 పర్యాటక కేంద్రాలను ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా తీర్చిదిద్దనున్నాం. రూ.7,700 కోట్లతో నల్లమల గుండా నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ తలమానికంగా నిలవనుంది.

అచ్చంపేట పట్టణాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అచ్చంపేటలో పట్టణీకరణ ఇటీవల బాగా పెరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏడెకరాల్లో రూ.పది కోట్ల వ్యయంతో వైఎస్ఆర్ పార్కు నిర్మిస్తున్నాం. గాంధేయవాది దివంగత పుట్టపాగ మహేంద్రనాథ్ పేరిట రెండు కోట్ల రూపాయలతో రవీంద్రభారతిని నిర్మించనున్నాం. సీసీ రోడ్లకు అధిక ప్రాధాన్యతనిచ్చి సత్వరం పూర్తి చేయాలని యాక్షన్ ప్లాన్‌ను రూపొందించుకున్నాం.

నేటి నుంచి రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శన కమిటీ సభ్యులతో సమీక్ష చేస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఈవో ప్రవీణ్‌కుమార్

(మొదటి పేజీ తరువాయి)

కానున్నారు. రాష్ట్రస్థాయి బాల్ వైజ్ఞానిక్ ప్రదర్శినిలో 561, రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో 300 ప్రదర్శనలను విద్యార్థులు ప్రదర్శించనున్నారు. పాఠశాలలోని 51 గదులలో ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 27 ప్రదర్శనలు ప్రదర్శించనున్నారు. సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అండ్ టెక్నాలజీతో పాటు, 1.ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, 2.రవాణా, కమ్యూనికేషన్, 3. సహజ వ్యవసాయం, 4.విపత్తు నిర్వహణ, 5. గణిత నమూనా, గణన ఆలోచన, 6.వ్యర్థాల నిర్వహణ, 7.వనరుల నిర్వహణ ఉప అంశాలపై ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. ఉత్తమ ప్రదర్శనలను జాతీయ స్థాయికి ఎంపిక చేయనున్నారు.

ముఖ్య అతిథులుగా మంత్రులు

ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహ, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, జడ్చర్ల జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్సీలు, జిల్లాలోని ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు హాజరుకానున్నారు. ముగింపు సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నారు. ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో ఇప్పటికే సమావేశం నిర్వహించారు. పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రదర్శన కేంద్రాన్ని కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఈవో ఇతర అధికారులు పరిశీలించారు.

చేరుకుంటున్న విద్యార్థులు

ప్రదర్శనల్లో పాల్గొనే విద్యార్థులు సోమవారం మధ్యాహ్నం నుంచే పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో ప్రదర్శనను ఏర్పాటు చేసుకునే గదితో పాటు వసతికి సంబంధించిన అంశాలను వివరించారు.

14 ఏళ్ల తర్వాత

విద్యార్థులలో శాస్త్ర, సాంకేతిక అంశాల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు 14 సంవత్సరాల అనంతరం నిర్వహిస్తున్నారు. ఎస్‌సీఈఆర్‌టీ, ఎన్‌సీఆర్‌టీల ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయి ప్రదర్శన నిర్వహించేందుకు మేడ్చల్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని పలు పాఠశాలలను ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు పరిశీలించారు. జడ్చర్ల మండలం పోలేపల్లి టీఎస్ఐఐసీలోని ఎస్వీకేఎం పాఠశాలను ఎంపిక చేశారు.

అదనపు కలెక్టర్ సమీక్ష

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సోమవారం సమీక్ష చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు 22 కమిటీలను ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీ సభ్యులతో డీఈవో ప్రవీణ్‌కుమార్‌తో కలిసి అదనపు కలెక్టర్ సమావేశం అయ్యారు. విద్యార్థులకు వసతి, భోజనం, తాగు నీరు, ప్రదర్శనలు, కనీస మౌలిక వసతులు, సౌకర్యాలు, ప్రదర్శనలను తిలకించేందుకు వచ్చే విద్యార్థులకు ఏర్పాట్లపై సమీక్షించారు. ప్రదర్శన నిర్వహించే పాఠశాలకు జాతీయ రహదారి నుంచే రావాల్సి ఉండటంతో రోడ్డు భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు, కమిటీల బాధ్యులు సమన్వయంతో లోటుపాట్లు లేకుండా పని చేయాలని చెప్పారు.

ఏర్పాట్లు పూర్తి

వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొననున్న 2,500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం వసతి, రవాణా, భోజన తదితర సౌకర్యాలు కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రోజూ 3,500 మందికి పైగా భోజనం సిద్ధం చేస్తున్నారు. పార్కింగ్ కోసం పది ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ప్రదర్శనలను రోజూ 10 వేల నుంచి 12 వేల మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు తిలకించనున్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశారు. బాలురకు జడ్చర్లలోని స్వామినారాయణ గురుకుల పాఠశాల, మిడ్‌ల్యాండ్ పాఠశాల, బాలికలకు జడ్చర్ల, బాలానగర్ కేజీబీవీలతో పాటు మౌంట్‌బేసిల్ పాఠశాలలో వసతి ఏర్పాటు చేశారు. నిర్వహణకు 25 కమిటీలను ఏర్పాటు చేశారు. అందులో మండల స్థాయి అధికారులు, జీహెచ్ఎంలు, ఉపాధ్యాయులను సభ్యులుగా ఉన్నారు. ఒక్కో కమిటీకి ఒక్కో బాధ్యత అప్పజెప్పారు.



వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనేందుకు ఎగ్జిబిట్‌తో వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయుడు

ప్రదర్శనలకు సర్వం సిద్ధం

డీఈవో ప్రవీణ్‌కుమార్

జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సెజ్‌లోని ఎస్వీకేఎం పాఠశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలకు ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్వీకేఎం పాఠశాలలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రారంభోత్సవానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహ, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లికృష్ణారావు, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తదితరులు వస్తారన్నారు. సైన్స్ ఫెయిర్ విజయవంతం అయ్యేందుకు కలెక్టర్ విజయేందిరబోయి చైర్మన్‌గా, తాను కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 7న రోడ్డు భద్రత అంశంపై అవగాహన, 8న మిల్లెట్స్‌పై కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.



ప్రదర్శన కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఫార్మసి ఆడిటోరియంలో బీసీ సెల్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. సమాజంలో ఎన్నో వివక్షలు ఎదుర్కొని మహిళా అభ్యున్నతి పాటు పడిన సావిత్రిబాయి పూలేను మహిళలు ఆదర్శంగా తీసుకొని రాజకీయ, వ్యాపార, విద్య, ఉపాధి రంగాల్లో రాణించాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప మాట్లాడుతూ దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే మహిళలకు ఆదర్శం అన్నారు. ముఖ్యవక్త డాక్టర్ సుభాషిని మాట్లాడుతూ భర్త మహాత్మా జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో చదువుకున్న సావిత్రిబాయి పూలే ఎంతో మంది మహిళలను విద్యావంతులని చేశారన్నారు. రిసోర్సుపర్సన్ డాక్టర్ భూమయ్య మాట్లాడుతూ బాల్య వివాహలు, సతీసహగమనం వంటి సాంఘిక దురాచారాలను ఎదిరించి ఎంతో మంది మహిళలను కాపాడరని అన్నారు. అంతకుముందు మహిళా అధ్యాపకులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య పాల్గొన్నారు.



మహిళా అధ్యాపకులను సన్మానించిన పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప

గ్రంథాలయ అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు

▸▸ నాగర్‌కర్నూల్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచకుళ్ల, ఎమ్మెల్యేలు

నాగర్‌కర్నూల్‌టౌన్/కొల్లాపూర్/కందనూలు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద విరాళాలు సేకరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ పట్టణంలో దాదాపు రూ.3 కోట్లతో నిర్మించిన జిల్లా గ్రంథాలయాల సంస్థ భవనం, సింగోటంలో పాఠశాల భవనాలను మంత్రి జూపల్లి ప్రారంభించారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరయ్యారు. అంతకు ముందు ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్‌గా గంగాపురం రాజేందర్ ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దముద్దునూరు గ్రామానికి చెందిన ఎన్.రమణరావు, వైస్ చైర్మన్‌గా జంగయ్య ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వమని, ప్రజలు, రైతుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రంథాలయ భవన ప్రారంభ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి తన నిధుల నుంచి రూ.25 లక్షలు విరాళంగా ప్రకటించి నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి ఎమ్మెల్యేలు వారి నిధుల నుంచి రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలని మంత్రి సూచించారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భం గా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయాల సంస్థ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్య అభ్యర్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డిలు మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



జిల్లా గ్రంథాలయ సంస్థ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

విద్యాభివృద్ధికి రూ.8 కోట్లు : మంత్రి జూపల్లి

కొల్లాపూర్ మండలంలోని సింగోటం గ్రామంలో రూ.40 లక్షలతో ఆధునీకరించిన ప్రాథమిక, జడ్పీహెచ్ఎస్ భవనాలను మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్, డీఈవో రమేష్ కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చర్చిద్దాం 'విద్యార్థుల భవిష్యత్ కోసం' అనే కార్యక్ర మంలో మంత్రి పాల్గొన్నారు. పిల్లల ఉన్నత చదువులు, వారి భవిష్యత్ కోసం ప్రభుత్వ పరంగా చేయాల్సింది ఏంటి? మీరేం చేయాలో సలహాలు సూచనలు ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. విద్యార్థులతో మంత్రి ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన అందిస్తామని తెలిపారు. తల్లిదండ్రుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఆ దిశగా కొల్లాపూర్ నియోజకవర్గంలో రూ.10 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధుల్లో రూ.8 కోట్లు విద్యా భివృద్ధికే కేటాయించినట్లు తెలిపారు. సింగోటం గ్రామంలో ప్రతీ ఇంటిపై సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు సీఎస్ఆర్ నిధుల నుంచి మంత్రి కోటి రూపాయలను మంజూరు చేసేందుకు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి నరేష్, కౌన్సిలర్లు ఎండీ నిజాముద్దీన్, జక్కు రాజ్‌కుమార్, కొత్త శ్రీనివాసులు, పద్మమ్మ, తీగల సునేంద్ర, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, పీఆర్‌ఈఈ శ్రీనివాస్, సింగోటం మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన రైతులు

12, 13వ తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బసవప్రభు

వనపర్తి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈనెల 12, 13వ తేదీల్లో వనపర్తిలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బసవప్రభు, కన్వీనర్ వేణుగోపాల్, కోకన్వీనర్ టీపీ కృష్ణయ్య తెలిపారు. సోమవారం జిల్లా చెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అండర్-9, అండర్-11, అండర్-13 విభాగాలతో పాటుగా ఆల్ కేటగిరి విభాగంలోనూ పురుషులు, మహిళలకు చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ విభాగంలో విజేతలకు నగదు బహుమతితో పాటుగా ట్రోఫీని అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఆల్ కేటగిరి విభాగంలో ఐదు బహుమతులు, మిగతా విభాగాల్లో మూడు బహుమతులతో పాటు నగదు పురస్కారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ ప్రతినిధులు సత్యనారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే కలెక్టరేట్‌లోకి నో ఎంట్రీ

▸▸ రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి



కలెక్టరేట్ గేట్ వద్ద వాహనదారులను హెల్మెట్ ధరించాలని సూచిస్తున్న ఎస్ఐ

వనపర్తి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రూరల్ ఎస్ఐ జలంధర్ రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా సోమవారం కలెక్టరేట్ గేటు వద్ద హెల్మెట్ లేకుండా ప్రజావాణికి వెళ్లే వారికి అనుమతి ఇవ్వకుండా ట్రాఫిక్ ఎస్ఐ సురేంద్ర, ఏ ఎస్ఐ నిరంజన్, సిబ్బంది బయటికి పంపారు. వారు మాట్లాడుతూ.. కొన్ని రోజుల నుంచి వనపర్తి పట్టణ ప్రాంతంతో పాటు పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ నియమ నిబంధనలను కఠినం చేయడమే కాక వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లోకి వెళ్లే ప్రతీ ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించి వెళ్లాలని, ఉద్యోగులు సైతం హెల్మెట్ ఉంటేనే కార్యాల యంలోకి అనుమతిస్తున్నామని తెలిపారు.

వణికిస్తున్న చలి




డిండి వద్ద హైదరాబాద్ - శ్రీశైలం రహదారిపై లైట్లు వేసుకొని ప్రయాణం సాగిస్తున్న వాహనదారులు

రెండు రోజులుగా నాగర్‌కర్నూల్ జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. మధ్యరాత్రి నుంచే మంచు కురవడంతో చలి ప్రభావం అధికమైంది. ఉదయం ఎనిమిది గంటలు దాటినా బయటకు వెళ్లాలంటే ప్రజలు గజగజ వణుకుతున్నారు. మంచు విపరీతంగా కురవడంతో నింగీనేలా కలిసిపోయినట్లు కనిపిస్తోంది. సోమవారం శ్రీశైలం హైదరాబాద్ రహదారి పొడవునా డిండి నుంచి హాజీపూర్ దాకా వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

- అచ్చంపేట, ఆంధ్రజ్యోతి



డిండి ప్రాజెక్టు సమీపంలో పంటపొలాన్ని కమ్మేసిన పొగమంచు



డిండి ప్రాజెక్టు సమీపంలో ఉదయం ఎనిమిది గంటలకు మంచుతెరలను తెంచుకొని వస్తున్న సూర్యుడు

స్పోర్ట్స్ బాక్స్

హ్యాండ్‌బాల్ టోర్నీలో ప్రతిభ చాటాలి

- అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్



జిల్లా జట్టుతో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, కోచ్ రోజా, పీడీ ఉమాపతి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి విజేతలుగా నిలవాలని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్ అన్నారు. హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా బాలుర జట్ల ఎంపికకు మహబూబ్‌నగర్ పట్టణంలోని డీఎస్‌ఏ స్టేడియంలో సోమవారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లా బాలుర జట్టులో శివకుమార్, చరణ్, అభి, పవన్, విజయ్, కార్తీక్, జీవన్, నిఖిలేశ్వర్, సక్కురామ్, శ్రీను, మహేష్, శేషు, రాంచరణ్, శివకుమార్, అరుణ్‌నాయక్, తిమోతి ఎంపికయ్యారు. కార్యక్రమంలో కోచ్ రోజా, సీనియర్ క్రీడాకారుడు అభిలాష్, పీడీ ఉమాపతి, వీరన్న మహేష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

» వాలీబాల్ పురుషుల జట్టులో ముగ్గురికి చోటు



క్రీడాకారులు భాగ్యరాజ్, ఫర్హాన్‌ఖాన్, మహ్మద్ హబీబుద్దీన్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి వాలీబాల్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టులో ముగ్గురు జిల్లా క్రీడాకారులకు చోటు లభించింది. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో మంగళవారం నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీల్లో జిల్లాకు చెందిన భాగ్యరాజ్, ఫర్హాన్‌ఖాన్, మహ్మద్ హబీబుద్దీన్ పాల్గొననున్నారు. వారిని వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, మహ్మద్‌హనీఫ్ అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

చెన్నై బయలుదేరిన 'పీయూ' చెస్ క్రీడాకారులు



చెస్ క్రీడాకారులతో వీసీ ప్రొఫెసర్ జీ.ఎన్.శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ చెస్ క్రీడాకారులు సోమ వారం చెన్నైకి బయలుదేరి వెళ్లారు. అక్కడి వెల్‌టెక్ యూనివర్సిటీలో ఈ నెల ఎనిమిది నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ కనబరిచి యూనివర్సిటీకి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులకు ట్రాక్‌సూట్, టీమ్ యూనిఫాంలను అందించారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య, పీడీ డాక్టర్ శ్రీనివాసులు, కోచ్‌లు పాల్గొన్నారు.

చేపల వలలో కొండ చిలువ

» కాపాడిన స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్



కొండ చిలువను అటవీశాఖ అధికారికి అప్పగిస్తున్న కృష్ణసాగర్

కొత్తకోట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, కొత్తకోట మండలం, కానాయపల్లి శివారులోని పంప్‌హౌస్ సమీపంలో ఉన్న బీమా కాలువలో మత్స్యకారులు వేసిన చేపల వలకు ఓ కొండ చిలువ చిక్కుకున్నది. అటు నుంచి వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు రమేశ్ దానిని గమనించి, స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆయన కాలువ వద్దకు చేరుకున్నారు. వలను బ్లేడ్‌తో జాగ్రత్తగా కట్ చేసి కొండ చిలువను సురక్షితంగా బయటకు తీసి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. కృష్ణసాగర్‌కు స్థానికులు గోపాల్‌యాదవ్, హందత్ సహకరించారు.

శ్రీశైలం జలాశయంలో 860 అడుగులకు చేరిన నీటిమట్టం

» వారం రోజులుగా పంపుమోడ్ నిలిపివేత

దోమలపెంట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, సోమవారం 860.50 అడుగులకు చేరింది. 215.8070 టీఎంసీలకు గాను, 107.4528 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం గేజింగ్ అధికారులు తెలిపారు. ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలోని ఒకటవ యూనిట్ డ్రాఫ్ట్‌ట్యూబ్, జీరో ఫ్లోర్ స్లాబ్ నుంచి వాటర్ లీకేజీ అవుతున్నందున వారం రోజులుగా డ్యాంలోకి నీటి మళ్లింపు (పంప్‌మోడ్)ను నిలిపివేశారు. ప్రస్తుతం రెండు, మూడు, ఐదు, ఆరు యూనిట్ల ద్వారా 21,189 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తున్నారు. కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి చేయడం లేదు. కృష్ణానదికి అనుసంధానంగా ఉన్న కాలువలు హంద్రీ, నివా సృజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్)కు 1,688, ఎంజీకేఎల్‌ఐకి 2,400, పోతిరెడ్డిపాడు రెగ్యులేటరీ (పీఆర్‌పీ)కి 1,500, ముచ్చుమర్రి (కేసీసీ)కి 490 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. లిఫ్ట్ ఇరిగేషన్‌ల ద్వారా ఎత్తిపోసే నీటిని పంటల సాగుకు, ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నట్లు ఇరిగేషన్‌శాఖ అధికారులు తెలిపారు.

టైలరింగ్‌తో ఉపాధి



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మూడు నెలల పాటు టైలరింగ్‌లో శిక్షణ పొందాను. అందులో భాగంగా ఫ్యాషన్ డిజైనింగ్, దుస్తుల తయారీ నేర్చుకొని, టైలరింగ్ షాప్ పెట్టుకున్నాను. ప్రస్తుతం మగ్గం వర్క్ కూడా నేర్చుకుంటున్నాను. నేను ఉపాధి పొందుతూనే మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నాను.

- నందిని, మర్లు, మహబూబ్‌నగర్.

ఆత్మ విశ్వాసం పెరిగింది



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఆరవ బ్యాచ్ లో ఎంఎస్ ఆఫీస్ కం ఫ్యూటర్ శిక్షణ పొంది, ఓ ప్రైవేట్ షోరూమ్‌లో ఉద్యోగంలో చేరాను. శిక్షణతో ఆత్మవిశ్వాసం పెరిగింది. శిక్షణను సద్వినియోగం చేసుకుంటే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

- శివాని, మహబూబ్‌నగర్.

మొబైల్ సర్వీసింగ్‌లో శిక్షణ



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మొబైల్ సర్వీసింగ్‌లో మూడు నెలల శిక్షణను పూర్తి చేసుకున్నాను. ఉదయం వేళ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నాను. సాయంత్రం మేము ఏర్పాటు చేసుకున్న మొబైల్ సర్వీసింగ్ సెంటర్‌లో సెల్‌ఫోన్లు మరమ్మతు చేస్తాను.

- అరుణజ్యోతి, మరికల్, నారాయణపేట.



టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న యువతులు, మహిళలు

ఉపాధికి ఊతం

- » యువతకు అండగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్
- » జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- » తొమ్మిది అంశాల్లో మూడు నెలల పాటు శిక్షణ
- » ఇప్పటి వరకు 3,200 మందికి ట్రైనింగ్



మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ యువతకు అండగా నిలుస్తోంది. వారికి ఆసక్తి ఉన్న వృత్తిలో శిక్షణ ఇస్తూ ఉపాధికి ఊతం అందిస్తోంది. ఇప్పటివరకు 15 బ్యాచ్‌లలో, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన 3,200 మంది ఇక్కడ శిక్షణ పొందారు. వారిలో చాలా మంది స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తున్నారు. రాష్ట్రం లోనే తొలిసారిగా గత ప్రభుత్వ హయంలో 2019లో మాజీ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ చొరవతో పాలమూరులో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

సెట్విన్ సౌజన్యంతో పరీక్షలు

ఈ కేంద్రంలో యువతీ యువకులకు మూడు నెలల పాటు తొమ్మిది అంశాలు ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెంట్ తయారీ, మగ్గం వర్క్స్, జర్దోసి, బ్యూటీషియన్ కోర్సు, ఎంఎస్ ఆఫీస్, ఏసీ, రిఫ్రిజిరేటర్ మరమ్మతు, మొబైల్ సర్వీసింగ్, హౌస్ వైరింగ్‌లలో శిక్షణ ఇస్తున్నారు. మూడు నెలల తరువాత సెట్విన్ సౌజన్యంతో పరీక్షలు నిర్వహించి ధ్రువపత్రాలు అందిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళాల్లో పాల్గొని ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. మరికొందరు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది బ్యూటీపార్లర్లు, మొబైల్ సర్వీస్ సెంటర్లు, టైలరింగ్ షాపులు ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందుతున్నారు. మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. ఒక బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ పూర్తి కాగానే దినపత్రికల్లో ప్రకటన ఇస్తారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వయసు పై బడిన మహిళలు, పురుషులు శిక్షణకు అర్హులు. ఈ కేంద్రంలో శిక్షణ పొందిన, పొందుతున్న వారిలో కొందరిని 'ఆంధ్రజ్యోతి' పలుకరించి అభిప్రాయాలను తెలుసుకున్నది. ఆ వివరాలు వారి మాటల్లోనే..

బ్యూటీ పార్లర్‌తో ఉపాధి



మహబూబ్‌నగర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో బ్యూటీషియన్ కోర్సు చేశాను. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లోని బోయపల్లిగేట్ వద్ద బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేశాను. మరి కొందరికి ఉపాధి కల్పిస్తానున్నాను. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

- డి.రమ్య, మహబూబ్‌నగర్.

హౌస్ వైరింగ్ నేర్చుకుంటున్నా..



వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో ఎలక్ట్రీషియన్ కోర్సులో చేరాను. 15వ బ్యాచ్‌లో హౌస్ వైరింగ్‌లో శిక్షణ పొందుతున్నాను. కోయిలకొండ నుంచి ప్రతీ రోజు వస్తాను. శిక్షణలో భాగంగా క్షేత్ర పరిశీలనకు కూడా తీసుకెళ్తారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి

- సందీప్, కోయిలకొండ.

సద్వినియోగం చేసుకోవాలి



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో యువతకు మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి, ధ్రువప త్రాలు అందిస్తున్నాం. శిక్షణ పొంది అభ్యర్థులకు స్వయం ఉపాధి కోసం బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. మా వద్ద శిక్షణ పొందిన వారు బ్యూటీ పార్లర్లు, టైలరింగ్ షాప్‌లు పెట్టుకొని ఉపాధి పొందుతున్నారు. వివిధ కోర్సుల్లో ఇప్పటి వరకు 3,200 మంది శిక్షణ పొందారు. ప్రస్తుతం 15వ బ్యాచ్‌కు శిక్షణకు ఇస్తున్నాం.

- ఎస్. శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్ జిల్లా.

సైబర్ నేరగాళ్ల ముఠా పట్టివేత



వనపర్తి రాజీవ్ చౌరస్తా, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో ధని యాప్ పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు అమాయకులకు ఫోన్లు చేసి లోన్లు ఇప్పిస్తామని నమ్మబలికి కోట్ల రూపాయలు కొల్లగొట్టినట్లు ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. మీకు లోన్ మంజూరు అయ్యిందని ఇన్సూరెన్స్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని కోట్ల రూపాయలు వసూలు చేశారని చెప్పారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన తొగుట రాజు (43) ఫేస్‌బుక్‌లో వచ్చిన ధని యాప్ లోన్ ప్రకటన పేజీని టచ్ చేయగా అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి లోన్ ఇప్పిస్తామన్నట్లు తెలిపారు. అడిగినంత లోను ఇప్పిస్తామని చెప్పి ఇన్సూరెన్స్ తదితర ఖర్చుల కోసం విడతల వారీగా స్కానర్‌కు డబ్బులు వేయించుకున్నారన్నారు. రాత్రి వరకు అకౌంట్లో మీరు అడిగిన డబ్బు జమ అవుతుందని బాధితునికి తెలిపారన్నారు. డబ్బులు జమ కాలేదని గ్రహించిన బాధితుడు సదరు వ్యక్తులకు మరుసటి రోజు ఫోన్ చేస్తే మళ్లీ డబ్బులు అడిగారన్నారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు డిసెంబరు 21వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసుల దర్యాప్తు ఆధారంగా ముద్ర, ధని యాప్‌లలో రాష్ట్ర స్థాయిలో సైబర్ నేరాలకు పాల్పడిన 35 మందిని గుర్తించినట్లు తెలిపారు.

వారిలో సోడే కృష్ణ కుమార్ చింటూ, కొత్త ఆంజనేయులు, జనంపల్లి నితీష్ కుమార్ రెడ్డి, ఆగుపోగు మహేష్, సోడే భాను, దోసల నవీన్ కుమార్ రెడ్డి, మోరెడ్డి ఉదయ్ కుమార్ రెడ్డి అను ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ వివరించారు. వారిని విచారించగా ఇప్పటి వరకు కోల్‌కత్తా, ఢిల్లీ, పాట్నాలలో ఉంటూ అంకిత్, రాహుల్, పంకజ్, వారి సహచరులు చెప్పినట్లుగా సైబర్ నేరాలు చేసి డబ్బులు సంపాదించినట్లు తెలిపారు. వీరందరూ రెండు తెలుగు రాష్ట్రాలలో దాదాపు 1000 మందిని మోసగించి, సుమారు రూ. రెండు కోట్లు బాధితుల నుంచి కాజేసినట్లు తెలిపారు. అయితే పట్టుబడిన వారికి వాటాగా రూ. 50 లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. ఆ ధనాన్ని వీరంతా విలాసాలకు వాడుకున్నట్లు వివరించారు. వారి వద్ద నుంచి ఆరు మొబైల్ ఫోన్లు, నాలుగు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ డీఎస్పీ రత్నం, డీసీఆర్‌బీ ఎస్‌ఐ రవి ప్రకాష్, సైబర్ క్రైమ్ కానిస్టేబుళ్లు నగేష్, సత్యం, విజయ్, పోలీస్ సిబ్బందికి క్యాష్ రివార్డు అందజేసి ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, సైబర్ క్రైమ్ డీఎస్పీ రత్నం, డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేశ్ వనపర్తి సీఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

» ఐదుగురికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన భరత్, అభినయ్ (ఫైల్)

తాడూరు/ శ్రీరంగాపూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని బల్లాన్‌పల్లికి చెందిన ఒకరు, వనపర్తి జిల్లా శ్రీరం గాపూర్ గ్రామానికి చెందిన మరొకరు మృతి చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని భల్లాన్‌పల్లి గ్రామవాసి శివకుమార్‌కు చెందిన బొలేరోలో పండు మిరపకాయలను లోడ్ చేసుకొని రైతు కుమార్, భరత్, దయాకర్‌లు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని మలక్‌పేట మిర్చి మార్కెట్‌కు బయలు దేరారు. హైదరాబాద్ సమీపంలోని తుక్కుగూడ వద్ద వారి వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నది. దీంతో బొలేరో క్యాబిన్‌పై కూర్చొన్న భరత్ (18) కిందపడిపోవడంతో, అక్కడి కక్కడే మృతి చెందాడు. దయాకర్‌తో పాటు డ్రైవర్ శివకుమార్, రైతు కుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

వారిలో దయాకర్ కోమాలో ఉన్నట్లు తెలిసింది. సంఘటనకు సంబంధించి తమకు సమాచారం అందలేదని ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ శ్రీరంగాపురం గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి రాధాకృష్ణ కుమారుడు అభినయ్ (20), స్నేహితుడు శేఖర్‌తో కలిసి సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై గ్రామం నుంచి పెబ్బేరుకు వెళ్తున్నారు. పెబ్బేరు నుంచి జానీ అనే యువకుడు కంబాళాపురానికి బైక్‌పై వస్తున్నాడు. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ గ్రామ సమీపంలో ఢీకొని కిందపడ్డారు. అదే సమయంలో శ్రీరంగాపురం నుంచి పెబ్బేరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ వారిని ఢీకొనడంతో అభినయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. శేఖర్, జానీలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. బాధితులను 108 అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కరెంట్ షాక్‌తో రెండు మేకలు మృతి

బిజినేపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పొలంలో మేత మేస్తూ విద్యుత్ స్తంభానికి తగిలిన రెండు మేకలు కరెంట్‌షాక్‌తో మృతి చెందాయి. కాపరికి త్రుటిలో ప్రమాదం తప్పింది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన నాగయ్య సోమవారం మేకలను మేపేందుకు గ్రామ శివారులోని పొలాలకు తీసుకెళ్లాడు. అక్కడ రెండు మేకలు మేత మేస్తూ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి తగిలి షాక్‌కు గురై మృతి చెందాయి. వాటిని కాపాడే యత్నంలో నాగయ్య కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అదే సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

చోరీ కేసులో ఇద్దరి రిమాండ్

లింగాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన బళ్లారి అజయ్, నల్లగొండ తరుణ్ (కర్ణ) అనే యువకులు మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రం వద్ద నిలబడి ఉన్న ఓ వ్యక్తి నుంచి డబ్బు చోరీ చేశారు. ఆ తర్వాత బస్టాండ్ సమీపంలోని భారత్ గ్యాస్ గోడౌన్ వద్ద మరో వ్యక్తి జేబులోనుంచి మొబైల్ ఫోన్ చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి, సోమవారం అచ్చంపేట కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధికారి ఉత్తర్వుల మేరకు వారిని రిమాండ్‌పై మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

మహబూబ్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి న్యాయాధికారి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. కొల్లాపూర్‌కు చెందిన మహేశ్ ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు పట్టు బడ్డాడు. సోమవారం అతడిని కోర్టులో హాజరు పరచగా, రెండు రోజుల జైలు శిక్ష, రెండు వేల జరిమానా విధిస్తూ సెకెండ్ క్లాస్ న్యాయాధికారి డి నిర్మల తీర్పు వెల్ల డించినట్లు వన్‌టౌన్ సీఐ అప్పయ్య తెలిపారు.

54 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

దామరగిద్ద, అలంపూర్ చౌరస్తా, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం, మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నిడ్జింత గ్రామానికి చెందిన ఎం. రాఘవేందర్ అనే వ్యక్తి తన ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసుకున్నాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు మద్దూరు ఎస్‌ఐ రాంలాల్ తెలిపారు. అలాగే దామరగిద్ద మండలం సజ్జనాపూర్ గ్రామానికి చెందిన బిట్లపల్లి శ్రీకాంత్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల బియ్యాన్ని స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దామరగిద్ద ఎస్‌ఐ రాజు తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పోతుల పాడు స్టేజీ వద్ద నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కానిస్టేబుళ్లు మంజునాథ నాయుడు, అనీల్ కుమార్‌లు బ్లూకోల్ట్ విధులు నిర్వహిస్తుండగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో పోతులపాడు స్టేజీ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను ఆపి తనిఖీ చేశారు. కర్నూలు జిల్లా సింగవరం గ్రామానికి చెందిన డ్రైవర్ జగదీష్ ఆటోలో నాలుగు క్వింటాళ్ల (12 సంచులు) రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఆటోను స్టేషన్‌కు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఇందిరమ్మ ఇళ్ల సర్వే 90 శాతం పూర్తి అయ్యింది

● గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌రావు



ధన్వాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం కోసం ప్రభుత్వం ఇటీవల వార్డుల వారీగా ఇళ్ల సర్వేను నిర్వహిస్తోంది. ధన్వాడలో ఇప్పటివరకు ఇళ్ల సర్వే 90 శాతం పూర్తి అయ్యిందని గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌రావు సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ధన్వాడలో ఎన్ని ఇళ్లకు దరఖాస్తులు చేసుకున్నారు?

ప్రజాపాలనలో ఇళ్ల కోసం 2,486 దరఖాస్తులు వచ్చాయి.

ఇళ్ల సర్వే ఎంతవరకు వచ్చింది?

ఇప్పటివరకు 2,206 ఇళ్ల సర్వే పూర్తి అయ్యింది.

ఇంకా ఎన్ని ఇళ్లు సర్వే చేయాలి?

ఇళ్ల సర్వే ఇంకా 282 చేయాల్సి ఉంది.

సర్వేలో పేర్లు రాని వారి పరిస్థితి ఏమిటి?

మళ్లీ కొత్త దరఖాస్తులకు ప్రభుత్వం అవకాశం ఇస్తుంది. అప్పుడు దరఖాస్తు చేసుకోవాలి.

సర్వే కాని వారి పరిస్థితి ఏమిటి?

వలస వెళ్లిన వారు మాత్రమే ఇంకా సర్వేలో ఉన్నారు. వారు రెండు రోజుల్లో పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలి.

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం ధాన్యం విక్రయానికి వచ్చింది. ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

ధాన్యం	క్వింటాళ్లు	గరిష్ఠ	కనిష్ఠ
		(రూపాయలలో)	
వరి సోన	158.40	2,493	1,800
ఎర్రకందులు	1745.38	8,288	6,262
తెల్ల కందులు	276.36	8,525	6,909

న్యూస్ బాక్స్

ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల గడువు పొడిగింపు

నారాయణపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లాలో అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ దివ్యాంగ విద్యార్థినీ, విద్యార్థులు ఉపకార వేతనాలు, బోధనా రుసుము పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 31 వరకు గడువు పొడిగించినట్లు ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోస్గి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండుమాల్ మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నీలిమ వర్ధిణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతిలో వంద సీట్లకు, ఏడు నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లకు ఫిబ్రవరి 28వ తేదీలోగా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉచిత కుట్టుమిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

నారాయణపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర క్రైస్తవ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అర్హత కల్గిన లబ్ధిదారుల నుంచి ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద ఉచిత కుట్టు మిషన్లను అందించేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ.రషీద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం స్థానిక కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కొత్తపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నాపూర్ గ్రామంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను పీఏసీఎస్ మండల అధ్యక్షుడు గూళ్ల నర్సింహులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రఘుపతిరెడ్డి ప్రారంభించారు. టోర్నమెంట్‌లో 40 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేత జట్టుకు రూ.18 వేలు, రన్నర్ జట్టుకు రూ.10 వేల నగదు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, చెన్నప్ప, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఊట్కూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా దివ్యాంగులు, వయో వృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో నషా ముక్త్ భారత్ అభియాన్ వలంటీర్లు సంధ్య, లక్ష్మీకాంత్‌లు గంజాయి వాడటం వల్ల కలిగే నష్టాలను వివరించారు.

28వ రోజుకు చేరిన సమ్మె

నారాయణపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విఘ్నాలు తొలగి విజయం వరించాలని వేడుకుంటూ సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు గణపతి హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. మునిసిపల్ పార్కు వద్ద ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం 26వ రోజుకు చేరుకుంది.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

» బీఆర్ఎస్ మండిపాటు
» రైతు భరోసా తగ్గింపుపై నిరసన
» పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో



నారాయణపేటలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణపేట/మరికల్/ధన్వాడ/కొత్తపల్లి/ఊట్కూర్/దామరగిద్ద, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బీఆర్ఎస్ పేట మండల అధ్యక్షుడు వేపూరి రాములు, పట్టణ ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డిలు మండిపడ్డారు. సోమవారం నారాయణపేట సత్యనారాయణ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. రాష్ట్రం అప్పుల పాలైందని అబద్ధాలు చెప్పి తప్పించుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడం లేదని ఆరోపించారు. రైతు భరోసా రూ.15 వేలు ఇచ్చేదాకా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతామన్నారు. బీఆర్ఎస్ నాయకులు కన్న జగదీష్, సుదర్శన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సురేందర్, రాము, వెంకటేష్, మల్లేష్, దేవరాజ్, రాంరెడ్డి తదితరులున్నారు.

అదేవిధంగా, మరికల్ మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లంబడి తిరుపతయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గంటపాటు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు రేవంత్‌రెడ్డి రైతులను నమ్మించి మోసం చేశారన్నారు. ఎన్నికల ముందు ఎకరాకు రూ.15 వేలు రైతు భరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రస్తుతం రూ.12 వేలకు కుదించి రైతులను నట్టేటా ముంచారన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, రామస్వామి, రవికుమార్, బసంతు, నారాయణ, హుసేన్, హన్మంతు, అనంతరెడ్డి తదితరులున్నారు.

ధన్వాడలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ సింధూజకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు సుధీర్‌కుమార్, గౌని శ్రీనివాసులు, టైలర్ శ్రీనివాస్‌గౌడ్, జుట్ల సత్యనారాయణగౌడ్, చాకలి చంద్రశేఖర్, నాసర్, శివారెడ్డి, వడ్ల శాంతికుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తపల్లిలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. మండల కేంద్రంలోని చౌరస్తాలో దాదాపు గంటపాటు నిర్వహించిన రాస్తారోకోతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రాంరెడ్డి, శివారెడ్డి, తెలుగు సాయిలు, రవీందర్‌రెడ్డి, రాజారెడ్డి, రఫీ, నరసింహ, మన్నెప్ప తదితరులున్నారు.

ఊట్కూర్ మండలం నిడుగుర్తి గ్రామంలో రైతు భరోసాను రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. గ్రామంలోని ప్రధాన రోడ్డుపై ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. రైతు సంఘం మండల నాయకులు శంకర్, ఉప్పరి శాంతప్ప, కురువ బుగ్గప్ప, తోక శంకరప్ప, ఉగ్ర నరసింహ, మోహన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

దామరగిద్దలో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుభాష్, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, నర్సప్ప, భీమయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

ఎంఎస్‌పీ చట్టాన్ని అమలు చేయాలి

» ఏఐయూకేఎస్ డిమాండ్
» తహసీల్దార్ కార్యాలయాల ముందు సంఘం ఆధ్వర్యంలో రైతుల ధర్నా



ఊట్కూర్ తహసీల్ వద్ద తహసీల్దార్ రవికి వినతిపత్రం ఇస్తున్న ఏఐయూకేఎస్ నాయకులు



మక్తల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు

ఊట్కూర్/దామరగిద్ద/మక్తల్/మద్దూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయుకేఎస్)జిల్లా ఉపాధ్యక్షుడు గవినోల్ల వెంకట్‌రెడ్డి అన్నారు. ఆల్ ఇండియా యూనైటెడ్ కిసాన్ సభ, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం ఊట్కూర్ తహసీల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మోదీ ప్రభుత్వం నల్లచట్టాలు రద్దు చేసి, పంటలకు కనీస మద్దతు ధరను ఇచ్చేలా ఎంఎస్‌పీ చట్టాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చి తన పరిపాలన కాలం పూర్తయి మళ్లీ అధికారంలోకి వచ్చినా దాని ఊసే ఎత్తకపోవడం శోచనీయమన్నారు. ఇటు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసాను ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.12 వేలు అంటూ పేర్కొంటున్నారని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలు కోసం ఈనెల తొమ్మిదిన దేశవ్యాప్తంగా డిమాండ్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతకుముందు మండల అధ్యక్షుడు చంద్రాములు, కార్యదర్శి అంజప్పలు మాట్లాడారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రవికి అందించారు. ధర్నాలో చిన్నబాలు, రవి, లొట్టి గోవిందు, రామాంజనేయులు, చెన్నప్ప, జి.గోవర్ధన్‌రెడ్డి, ఎల్లప్ప, బాలరాజు, హన్మంతు, నర్సిములు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అదేవిధంగా, దామరగిద్ద తహసీల్దార్ కార్యాలయం ముందు అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు పెద్దింటి తాయప్ప మాట్లాడారు. ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కోశాధికారి పెద్దింటి మధు, కర్రెప్ప, ఎం.పెంటప్ప, ఎం.కాశప్ప, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మక్తల్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ నాయకులు ఎస్.కిరణ్ ధర్నాకు సంఘీభావం తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు ఆనంద్, జిల్లా నాయకులు రాజు, బుట్టో, గోపాల్, ప్రసాద్, గడ్డం అంజనేయులు, ఆశప్ప, నక్క తాయప్పలు పాల్గొన్నారు.

మద్దూర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ముందు అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మహేశ్‌గౌడ్‌కు అందించారు. ఏఐయూకేఎస్ జిల్లా కార్యదర్శి యాదగిరి. సహాయ కార్యదర్శి కొండ నర్సిములు, హనుమప్ప, సాయిలు, హన్మంతు, పాండు, పీడీఎస్‌యూ నాయకుడు విజయ్, పీవైఎల్ నాయకుడు కాశీతో పాటు, రైతులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం


మక్తల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలు అమలుపర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన ఇంట్లో బీజేపీ అర్బన్‌శాఖ ఆధ్వర్యంలో పార్టీ సంస్థాగత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసకారి మాటలతో రైతులను మోసం చేసిందని విమర్శించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రజల పక్షాన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అనంతరం ఎన్నికైన బూత్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకుడు చందపురం చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి కుర్వలింగం, కౌన్సిలర్ ఆనంపల్లి కొండయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు పాల్గొన్నారు.

'బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి'

నారాయణపేటరూరల్/మరికల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ప్రకటించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కెంచె శ్రీనివాసులు అన్నారు. సోమవారం పేట జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 57 శాతం ఉన్న బీసీలను కాంగ్రెస్ పార్టీ చెప్పిన 42 శాతం రిజర్వేషన్లను ప్రకటించి అన్నింటిలో బీసీలకు న్యాయం జరిగేటట్లు చూస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అధికారమే లక్ష్యంగా బీసీలను మోసం చేసిందని విమర్శించారు. సమావేశంలో బీజేపీ నాయకులు వెంకట్రాములు, కెంచె ఉదయభాను, నక్క సత్యనారాయణ, నర్సిములు తదితరులున్నారు.

అదేవిధంగా, మరికల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి మహేందర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం గడుస్తున్నా బీసీ రిజర్వేషన్ గురించి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈనెల ఏడో తేదీన మండల కార్యాలయం ముందు నిరసన నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిన్ననర్సన్‌గౌడ్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే శ్రీరామ్, సురేందర్‌గౌడ్, నిఖిల్, వెంకటేష్, నగేష్ తదితరులున్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి



అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

మక్తల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దళిత గెజిటెడ్ ఉపాధ్యాయుడు కంబలి రాములుపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సాయంత్రం అంబేద్కర్ చౌరస్తాలో డీటీఎఫ్, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు హైమావతి, ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌లు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలో గెజిటెడ్ హెచ్‌ఎం కంబలి రాములుపై మతోన్మాదులు దాడిచేసి పది రోజులు గడచినా ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, ఉపాధ్యాయులు రాఘవేంద్రచారి, నగేష్, రాజు, హన్మంతు, శ్రీవిద్య, శిరీష, జయశ్రీ, రేణుక, కురుమూర్తి, కవిత, అంబేద్కర్ సంఘం నాయకులు రాజు, మద్దిలేటిలు పాల్గొన్నారు.

ప్రజావాణికి 35 ఫిర్యాదులు



ప్రజావాణిలో ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రజావాణికి 35 ఫిర్యాదులు అందాయి. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ సిక్తాపట్నాయక్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచొద్దని అధికారులను ఆదేశించారు. ప్రజలు ప్రజావాణిని వినియోగించుకోవాలని సూచించారు.

రుచికరమైన భోజనం అందించాలి

కోస్గి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని డీఆర్డీవో పీడీ మొగులప్ప అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముశ్రీఫా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు, హనుమాన్‌పల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మెనూ రిజిస్టర్‌ను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో శ్రీధర్, హెచ్‌ఎం శేఖరయ్య, హన్మంతు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

నారాయణపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నజట్రం గ్రామంలో కల్యాణ్(22) అనుమానాస్పద స్థితిలో సోమవారం సాయంత్రం ఇంట్లో ఊయలకొండికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయ కూలీగా పనిచేస్తున్న కల్యాణ్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడగా సాయంత్రం కుటుంబీకులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పేట రూరల్ ఎస్‌ఐ రాముడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కలెక్టర్‌ను కలిసిన అబాకస్ పోటీల విజేతలు



కలెక్టర్‌ను కలిసిన అబాకస్ పోటీల విజేతలు, శిక్షకురాలు

నారాయణపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అబాకస్ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులతో పాటు, శిక్షకురాలు రీతూశర్మవైకుంఠ్ సోమవారం పేట కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను కలిశారు. ఇటీవల మహారాష్ట్ర పుణెలో ఏడవ నేషనల్, 14వ ఇంటర్నేషనల్ అబాకస్ పోటీల్లో నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన చరణ్‌కుమార్‌తో పాటు కృషికా, వైష్ణవి, రిషిక్, సాయికృష్ణలు అవార్డు అందుకున్నారని శిక్షకురాలు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు ప్రశ్నలు వేయగా జవాబులు ఇచ్చిన చిన్నారులను అభినందించారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి : ఎస్పీ

నారాయణపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈనెల మొత్తం వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ యోగేష్‌గౌతమ్ జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన పోలీస్ అధికారులతో మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ప్రమాదకరమని, హెల్మెట్ ధరించి మీ భద్రతకు అవసరం అనే విషయాన్ని గుర్తించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు బలమైన గాయాలతో ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. మద్యం తాగి, ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపొద్దన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానాతో పాటు జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు.

పంట పొలాలకు నీటి విడుదల



ధన్వాడ పెద్ద చెరువు నుంచి నీటిని విడుదల చేస్తున్న నాయకులు

ధన్వాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం పెద్ద చెరువు నుంచి పంట పొలాలకు నీటిని విడుదల చేశారు. తూము వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి యాసంగి పంటకు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులతో పాటు నారాయణపేట మార్కెట్ యార్డు డైరెక్టర్లు జట్రం లక్ష్మయ్యగౌడ్, నీరటి రాంచంద్రయ్యముదిరాజ్, చీరాల సుధాకర్‌రెడ్డి, కందనూర్ రహిమున్‌ఖాన్, చిట్టెం రాఘవేందర్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, అలుగుమీది భాస్కర్, ముసిరిగారి నర్సిములు, షాకీర్‌హుస్సేన్, నీరటిబాబు, సంద రాజు, చంద్రయ్య, కోతి రాజు తదితరులున్నారు.

మునిసిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామరెడ్డి

నారాయణపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను రెగ్యులరైజ్ చేసి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని మునిసిపల్ కార్మికుల ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామరెడ్డి, కార్యదర్శి బాల్‌రామ్‌లు అన్నారు. సోమవారం నారాయణపేట మునిసిపల్ పార్కు వద్ద మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో జరిగిన ధర్నాను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి గోపాల్, సాయిలు, గణేష్, అశోక్, జాకీర్ హుస్సేన్, కర్రెం కృష్ణ, జి.కురుమూర్తి, అనిత, గిరి మారెప్ప తదితరులున్నారు.

నేడు ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో రథయాత్ర

» ఫిబ్రవరి ఏడున చలో హైదరాబాద్ » డప్పు దరువులతో ప్రదర్శనకు రావాలి
» ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గోనిపాటి కళ్యాన్‌మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న గోనిపాటి కళ్యాన్‌మాదిగ

నారాయణపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుపరచుకోవడానికి ఫిబ్రవరి ఏడో తేదీన చలో హైదరాబాద్‌కు డప్పు దరువులతో ప్రదర్శనకు రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గోనిపాటి కళ్యాన్‌మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది ఆగస్టు ఒకటిన సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాత అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకువస్తానని చెప్పి ఐదు నెలలు గడుస్తున్నా వర్గీకరణ అమలు కావడం లేదని విమర్శించారు. మంగళవారం ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో వెయ్యి గొంతుకలతో లక్ష డప్పుల కళామండలి ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు. వెంకటయ్య, చంటి, రమేష్ కృష్ణ, రవి, మాధవ్, హనుమంతు, నరేందర్, తాయప్ప ఉన్నారు.

ప్రత్యేక గ్రామ పంచాయతీగా ప్రకటించాలి

మరికల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మరికల్ మండలం గాజులయ్య తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ప్రకటించాలని ఆ గ్రామ మాజీ ఉపసర్పంచ్ భాస్కర్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ జమీల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గాజులయ్యతండా, బండతండాల్లో 600 మంది ఓటర్లు ఉన్నారన్నారు. గ్రామ పంచాయతీగా ఏర్పాటుచేయడానికి తండాలో అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వచ్చే స్థానిక ఎన్నికల వరకు గ్రామ పంచాయతీగా ప్రకటించాలని డిమాండ్‌చేశారు. రాంసింగ్‌నాయక్, రాములునాయక్, మంగ్యానాయక్, వెంకట్‌నాయక్, రవినాయక్ ఉన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ధన్వాడ/ఊట్కూర్/కోస్గి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ధన్వాడ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం తపస్ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంఈవో గాయత్రి, హెచ్‌ఎం నర్సింహ్మాచారి, తపస్ సంఘం మండల అధ్యక్షుడు సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి శేఖర్‌గౌడ్, రవివర్మ, అశోక్, వెంకటేష్, రాకేష్, సురేఖ, శ్రీదేవి, స్వప్న, అనంత నయనలు పాల్గొన్నారు.

అదేవిధంగా, ఊట్కూర్‌లోని సీపీఎస్ ఆవరణలో పీఆర్టీయూ క్యాలెండర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సూర్యప్రకాష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డితో పాటు, పెద్దజట్రం జీహెచ్‌ఎం గౌరమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు సూర్యప్రకాష్‌రెడ్డి, అరవింద్‌కుమార్‌లు మాట్లాడారు. పీఆర్టీయూ జిల్లా, మండల నాయకులు వడ్ల రవికుమార్, భాస్కర్, అంజనేయులు, సత్యపాల్, నాగేష్, ఆనంద్, మహేష్, గురునాథ్, విజయ్‌కుమార్, రాములు, మజహర్, ఖాసీం, సభాసుల్తానా, మాధవి, భ్రమరాంభ, శ్రీవిద్యా, మంజుల తదితరులున్నారు.

కోస్గిలోని నీలకంఠ స్వామి దేవాలయంలో కురుహిణిశెట్టి జాంద్ర సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు బసప్ప, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడు కస్న బుడ్డప్ప, ఉపాధ్యక్షుడు బుగ్గప్ప, కోశాధికారి సత్యకుమార్, నాయకులు పాల్గొన్నారు.

విశ్వకర్మ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

నారాయణపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మొనప్పస్వామి దేవాలయ ఆవరణలో సోమవారం అఖిల భారత విశ్వకర్మ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడిగా నాగేందర్‌చారి, ప్రధాన కార్యదర్శిగా రాజప్పచారి, ఉపాధ్యక్షురాలిగా నాగమ్మ, కోశాధికారిగా దత్తాత్రేయచారి, సలహా సభ్యుడిగా దేవన్నచారి ఎంపికయ్యారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడారు.